క్లుప్తంగా

బాధిత కుటుంబానికి సాయం

ఖానాపూర్: పట్టణంలోని విద్యానగర్‌కు చెందిన బెజ్జారపు గంగాధర్, అతని తండ్రి చిన్నయ్య ఇటీవల మృతి చెందారు. దీంతో బాధిత కుటుంబానికి శుక్రవారం ఎన్‌ఆర్‌ఐ పస్నెల జనార్దన్ రూ.10వేలను సమకూర్చగా పలువురు కాలనీవాసులు లాలూనాయక్, శంకర్, మారుతి, ప్రసాద్, అశోక్, రాజ్‌కమల్, లక్ష్మి నగదు అందజేశారు.

లోకేశ్వరం ఎస్సైగా అశోక్



లోకేశ్వరం: లోకేశ్వరం ఎస్సైగా అశోక్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎస్సైగా పని చేసిన సక్రియా నాయక్ నిర్మల్ జిల్లా కార్యాలయానికి బదిలీ అయ్యారు. నిజామాబాద్‌లోని ఐదో టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్సైగా పని చేసిన అశోక్ బదిలీపై లోకేశ్వరం వచ్చారు. అందుబాటులో ఉండి ప్రజల సమస్యలను పరిష్కరిస్తానని పేర్కొన్నారు. ఆయన వెంట పోలీసులు ఉన్నారు.

భైంసారూరల్ ఎస్సైగా శ్రీనివాస్‌యాదవ్



భైంసారూరల్: భైంసా రూరల్ ఎస్సైగా శ్రీనివాస్‌యాదవ్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. నిజామాబాద్ జిల్లా మెండోర ఎస్సైగా విధులు నిర్వర్తించిన శ్రీనివాస్ బదిలీపై భైంసారూరల్ పోలీస్‌స్టేషన్‌కు వచ్చారు. ఈ సందర్భంగా నూతన ఎస్సైకి సిబ్బంది స్వాగతం పలికారు.

అల్ఫోర్స్‌లో ముందస్తు రాఖీ



రాఖీలతో చిన్నారులు

భైంసాటౌన్: పట్టణంలోని అల్ఫోర్స్ పాఠశాలలో శుక్రవారం వరలక్ష్మి వ్రతంతోపాటు ముందస్తు రాఖీ పండుగ నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులు అమ్మవారిని అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. వివిధ రకాల నైవేద్యాలు అమ్మవారికి సమర్పించారు. అనంతరం ముందస్తు రాఖీ వేడుకల్లో భాగంగా విద్యార్థులు ఒకరికొకరు రాఖీలు కట్టుకున్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బస్సు నడిపించాలని వినతి

మామడ: మండలంలోని నల్దుర్తి గ్రామానికి ఆర్టీసీ బస్సు నడపాలని శుక్రవారం ఆ ఊరి ప్రజలు నిర్మల్‌లో డిపో మేనేజర్ ప్రతిమారెడ్డికి వినతిపత్రం అందించారు. దిమ్మదుర్తి, పొన్కల్ గ్రామాలకు వెళ్లాలంటే ఇబ్బందిగా ఉందని.. బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో వీడీసీ చైర్మన్ జీవన్‌నాయక్, మాజీ ఎంపీటీసీ పడాల శ్రీనివాస్, భీమేశ్, రాజేశ్వర్, భూంరెడ్డి తదితరులున్నారు.

బంద్ సంపూర్ణం



మూసి ఉన్న దుకాణాలు

ఖానాపూర్: బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులకు నిరసనగా హిందూ సంఘాల పిలుపు మేరకు శుక్రవారం ఖానాపూర్ పట్టణంలో బంద్ నిర్వహించారు. వ్యాపార, వాణిజ్య సముదాయాలతోపాటు విద్యాసంస్థలు స్వచ్ఛందంగా బంద్ పాటించాయి. ప్రధాన కూడళ్లు నిర్మానుష్యంగా మారాయి.

ఉద్యోగులు విధిగా మొక్కలు నాటాలి



మొక్క నాటుతున్న ఆర్డీవో రత్నకల్యాణి

నిర్మల్‌చైన్‌గేట్: ప్రభుత్వ ఉద్యోగులు విధిగా మొక్కలు నాటి సంరక్షించాలని నిర్మల్ ఆర్డీవో రత్నకల్యాణి అన్నారు. వన మహోత్సవంలో భాగంగా పట్టణంలోని శుక్రవారం ఆర్డీవో కార్యాలయ ప్రాంగణంలో ఆర్డీఓ రత్న కల్యాణి మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఏవో రాజేశ్వర్, తహసీల్దార్లు రాజు, సంతోష్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పట్టుపురుగుల పెంపకంతో ఆదాయం

మామడ: పట్టుపురుగుల పెంపకంతో రైతులు మంచి ఆదాయం పొందవచ్చని ఆ శాఖ టెక్నికల్ అధికారి రాములు అన్నారు. శుక్రవారం మండలంలోని కప్పన్‌పల్లి అటవీ ప్రాంతంలో పట్టు పురుగుల పెంపకానికి అనువైన స్థలం పరిశీలించారు. అనువుగా ఉన్న నల్లమద్ది చెట్లపై పట్టు పురుగులను వదిలామని.. నెల రోజుల్లో పట్టుగూళ్లు వస్తాయన్నారు. అధికారులు యశ్వంత్, షరీఫ్, రైతులు భీమన్న, మల్లయ్య, ఆశిష్, పోశెట్టి పాల్గొన్నారు.

పనిచేయకుంటే బదిలీపై వెళ్లండి

- ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్
- లోకేశ్వరంలో వివిధ శాఖల పనితీరుపై సమీక్ష



విద్యుత్ ఏఈపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఎమ్మెల్యే రామారావు పటేల్

లోకేశ్వరం: ప్రజల సమస్యలు పరిష్కరించని అధికారులు వెంటనే బదిలీపై వెళ్లిపోవాలని ముధోల్ ఎమ్మెల్యే రామారావ్ పటేల్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని రైతువేదికలో రెవెన్యూ, పంచాయతీరాజ్, విద్యుత్, ఐసీడీఎస్, ఈజీఎస్ తదితర శాఖల మండల స్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా గతంలో అభివృద్ధి పనులు చేసిన సర్పంచ్‌లు, ఎంపీటీసీలకు ఇప్పటివరకు బిల్లులు రాలేదని గడ్‌చాంద ఎంపీటీసీ మాజీ సభ్యుడు జీవన్ ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. రాయపూర్‌కాండ్లీ, మన్మద్, గడ్‌చాంద, పిప్రి, లక్ష్మీనగర్ గ్రామాల్లో విద్యుత్ సమస్యలతో ఇబ్బందులు పడుతున్నామని ఆయా గ్రామాల ప్రజలు పేర్కొనగా.. వారం రోజుల్లో సమస్యలను పరిష్కరిస్తామని విద్యుత్ ఏఈ శివప్రసాద్ సమాధానమిచ్చారు. రాయపూర్‌కాండ్లీలో విద్యుత్ దీపాలు పనిచేయడం లేదని.. చెత్తను సేకరించడం లేదని ఎమ్మెల్యేకు విన్నవించారు.

లక్ష్మీనగర్ తండాలో గ్రూపులో జమ చేసుకున్న రూ.లక్షన్నర పంపిణీ చేయాలని కోరినా సీసీ రాజేశ్వర్ పట్టించుకోవడం లేదని గ్రూప్ మహిళలు ఎమ్మెల్యేకు విన్నవించారు. ధరణిలో భూసమస్యలతో ఇబ్బందులు పడుతున్నామని పలువురు పేర్కొనగా.. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని తహసీల్దార్ మోతీరాం తెలిపారు. వారం రోజుల్లో గ్రామాల్లో పానాదిల రోడ్ల వివరాలను నివేదిక రూపంలో ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సోలమాన్‌రాజ్, ఏపీవో జగన్నాథ్, ఏపీఎం మల్లేశ్, విద్యుత్ ఏఈ శివకుమార్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మీనా, గ్రామ కార్యదర్శులు ఉన్నారు.

82 మంది లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

లోకేశ్వరం: ప్రజా సమస్యలను తన దృష్టికి తీసుకొస్తే వాటి పరిష్కారానికి కృషి చేస్తానని ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని రైతువేదికలో మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన 82 మంది లబ్ధిదారులకు రూ.20 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పిప్రి ఎత్తిపోతల పథకం పనులకు రూ.22 కోట్లు మంజూరు చేయించామని.. వచ్చే యాసంగికల్లా పనులు పూర్తి చేసి సాగునీరు అందిస్తామని పేర్కొన్నారు. తహసీల్దార్ మోతీరాం, భైంసా మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రాజేశ్‌బాబు, ఎంపీడీవో సోలమాన్‌రాజ్, నాయకులు సుమన్‌కుమార్, నారాయణ్‌రెడ్డి, బద్దం గంగారెడ్డి, శ్రీధర్, చిన్నారావు, జయసాగర్‌రావు, భాస్కర్, మంద గణేశ్, ఆనంద్‌రావు, సాయినాథ్‌పటేల్, వికాస్, గంజాల గంగాధర్, సాయాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

'కేటీఆర్ మహిళలకు క్షమాపణ చెప్పాలి'



వినతిపత్రం ఇస్తున్న కాంగ్రెస్ నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్: తెలంగాణ ఆడబిడ్డలపై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వెంటనే క్షమాపణలు చెప్పాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్మల్‌లోని ఆర్డీవో కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌కు వినతిపత్రం అందించారు. కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ కేటీఆర్ శాసన సభ్యత్వం రద్దు చేయాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ సేవా దళ్ అధ్యక్షులు ఏంబడి రాజేశ్వర్, ఉద్యమకారులు కొట్టే శేఖర్, ఎన్‌ఎస్‌యూఐ అధ్యక్షుడు ఎంబడి రాకేశ్, బొల్లోజు నర్సయ్య, గాజుల రవికుమార్, మనోజ్, సాకోపెల్లి సురేందర్, కూర రాజు, సత్యపాల్‌రెడ్డి, సతీశ్, గణేశ్, ప్రవీణ్ రావ్, నర్సయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

నానో డీఏపీ, యూరియాపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఏఈవో అంబాజీ

సోన్: మండలంలోని కూచన్‌పెల్లి గ్రామంలో శనివారం డ్రీమ్ సంస్థ ఆధ్వర్యంలో నానో డీఏపీ, యూరియా వినియోగంపై ఏఈఓ అంబాజీ రైతులకు అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ ఆధునిక పద్ధతుల్లో భాగంగా నానో యూరియా పంటల దిగుబడికి ఎంతో దోహదపడుతుందన్నారు. దీంతో పర్యావరణానికి హాని ఉండదని వివరించారు. డ్రీమ్ సొసైటీ కోఆర్డినేటర్ చిన్నయ్య, గ్రామాభివృద్ధి ఫోరం సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

క్షీరాభిషేకం

లక్ష్మణచాంద: రైతులకు రుణమాఫీ చేస్తున్నందుకు మండలంలోని తిర్పెల్లి గ్రామంలో శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డి, రాహుల్‌గాంధీ చిత్రపటాలకు కాంగ్రెస్ నాయకులు క్షీరాభిషేకం నిర్వహించారు. ఆ పార్టీ మండలాధ్యక్షుడు ఒడ్నాల రాజేశ్వర్, నాయకులు ఈటెల శ్రీనివాస్, నగేశ్, సొన్నా భీమేశ్, సల్లే సుభాశ్, కొండ్ర అశోక్, గణేశ్, నవీన్, శంకర్, రాజేశ్వర్, మోహన్, లింగన్న తదితరులు పాల్గొన్నారు.

ఇస్తినమ్మా వాయనం.. పుచ్చుకుంటినమ్మా వాయనం

- భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతం
- భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు



నిర్మల్‌టౌన్: ఇంద్రనగర్‌లోని ఓ ఇంట్లో అమ్మవారు



గుజిరిగల్లిలో నృత్యం చేస్తున్న విద్యార్థినులు



భైంసాలోని పులేనగర్‌లో సామూహిక వరలక్ష్మీ వ్రతంలో మహిళలు



ముధోల్‌లోని పశుపతినాథ్ ఆలయంలో..



కుంటాలలోని మహాలక్ష్మీ ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

భైంసాటౌన్: పట్టణంలో మహిళలు శుక్రవారం వరలక్ష్మీ వ్రతం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక పులేనగర్ సుభద్రవాటిక శ్రీ సరస్వతి శిశుమందిర్‌తోపాటు కిసాన్‌గల్లి, గుజిరిగల్లి శిశుమందిర్ పాఠశాలల్లో సామూహిక వరలక్ష్మీ వ్రతం నిర్వహించారు. ఈసందర్భంగా మహిళలు అధిక సంఖ్యలో తరలివచ్చి పూజలు చేశారు. విద్యార్థినులు సాంస్కృతిక ప్రదర్శనలు చేశారు. కార్యక్రమంలో శోభా మాందాని, నారావాడ్ శ్యామల, పురస్తు సంగీత, విమల, రజిత, దివ్య, రాజశ్రీ, సారిక, ముత్తవ్వ, జ్యోతి, ఆచార్యులు పాల్గొన్నారు.

ముధోల్: శ్రావణమాసంలో రెండో శుక్రవారం సందర్భంగా మహిళలు వరలక్ష్మీ వ్రతం ఘనంగా నిర్వహించారు. కొందరు ఆలయాల్లో సామూహికంగా నిర్వహించుకుంటే మరికొందరు ఇళ్లలో వ్రతం చేశారు. అమ్మవారికి నైవేద్యం, ప్రసాదాలను సమర్పించారు. ఈ సందర్భంగా మహిళలు ఒకరికొకరు వాయనాలు ఇచ్చిపుచ్చుకున్నారు.

కుంటాల: మండలంలోని ఆయా గ్రామాల్లో శుక్రవారం మహిళలు భక్తి శ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతం ఆచరించారు. ఇంటిల్లిపాది సుఖ సంతోషాలతో ఉండాలని కోరుతూ మహాలక్ష్మిని ఆహ్వానిస్తూ ఇళ్లలో పూజలు చేశారు. కుంటాల మహాలక్ష్మి ఆలయంలో భక్తులు పూజల అనంతరం మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో గురుస్వాములు జక్కని గజేందర్, కదార్ల హరిప్రసాద్, గంగయ్య, నిమ్మల రాజు, తాటి శివ, గంగాధర రాజు, ఎల్ల గజ్జారాం, ఉమ, శశికళ తదితరులు పాల్గొన్నారు.

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని అమ్మవారి ఆలయాల్లో శుక్రవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు అమ్మవారికి ఓడి బియ్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఇండ్లలో లక్ష్మీదేవిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. ఒకరికొకరు వాయనాలు ఇచ్చి పుచ్చుకున్నారు.

న్యూకంజర్‌లో 'పుస్తక పఠనం'

లక్ష్మణచాంద: మండలంలోని న్యూకంజర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం పుస్తక పఠనం కార్యక్రమం నిర్వహించారు. జిల్లా విద్యాశాఖ సహకారంతో రూమ్ టు రీడ్ సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 15నుంచి సెప్టెంబర్ 8 వరకు వరకు రీడింగ్ క్యాంపెయిన్ చేపట్టనున్నట్లు హెచ్‌ఎం శంకర్ తెలిపారు. రూం టు రీడ్ సంస్థ మండల కోఆర్డినేటర్ గోవర్ధన్ నాయుడు, ఉపాధ్యాయులు, సీఆర్పీ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఏఈవోల బదిలీ

లక్ష్మణచాంద: మండలంలోని పలువురు ఏఈవోలు బదిలీ అయ్యారు. పీచర క్లస్టర్ ఏఈవోగా పని చేస్తున్న పవిత్ర లక్ష్మణచాంద ఏఈవోగా బదిలీ కాగా.. పొన్కల్ ఏఈవో జి.సుస్మిత బదిలీపై పీచర ఏఈవోగా రానున్నారు. లక్ష్మణచాంద ఏఈవో ఉమామహేశ్వరి బదిలీపై సోన్ ఏఈవోగా వెళ్లనున్నారు. కనకాపూర్ ఏఈవో సంతోష్‌కుమార్ బదిలీపై పొన్కల్ వెళ్లనున్నారు. కనకాపూర్ ఏఈవోగా లోకేశ్వరం నుంచి కె.మౌనిక రానున్నట్లు అధికారులు తెలిపారు.

అంబేద్కర్ సంఘం గ్రామ కమిటీ

లక్ష్మణచాంద: మండలంలోని వడ్యాల్ గ్రామంలో శుక్రవారం అంబేద్కర్ సంఘం కార్యవర్గ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామాధ్యక్షుడిగా రాసమల్ల మోహన్, ఉపాధ్యక్షుడిగా కప్పకంటి సుధాకర్, కోశాధికారిగా రావుల బండి సాయన్న ఎన్నికయ్యారు.

తాగునీటి విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలి



తానూరులో పరిసరాలు పరిశీలిస్తున్న ఎంపీడీవో

తానూరు: వర్షాకాలంలో రోగాల బారిన పడకుండా తాగునీటి విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీవో అబ్దుల్ సమద్ అన్నారు. శుక్రవారం డ్రైడేలో భాగంగా తానూరులో పర్యటించారు. పాత టైర్లు, పాత్రల్లో నీరు నిల్వకుండా చూడాలని గ్రామస్తులకు అవగాహన కల్పించారు. పంచాయతీ ట్రాక్టర్ల ద్వారా తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలన్నారు. మురికి కాలువలను శుభ్రపరిచి గ్రామస్తులకు క్లోరినేషన్ నీటిని అందించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైద్యుడు నరేశ్, సూపర్‌వైజర్ సలీనా, సిబ్బంది తదితరులు ఉన్నారు.

లక్ష్మణచాంద: మండల కేంద్రంలో శుక్రవారం లక్ష్మణచాంద పీహెచ్‌సీ ఆధ్వర్యంలో డ్రై డే నిర్వహించారు. ఈ సందర్భగా వైద్యసిబ్బంది పలు కాలనీలు సందర్శించి ఇళ్ల వద్ద పాతటైర్లు, కూలర్లలోని నిలవ నీటిని పారబోయించారు. ఈ సందర్భంగా వైద్యసిబ్బంది గ్రామస్తులకు పలు సూచనలు చేశారు. ఆరోగ్య విస్తరణాధికారి హరికుమార్ గౌడ్ మాట్లాడుతూ దోమల నివారణకు ఆయిల్ బాల్స్ వేస్తున్నామని ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్త శివకృష్ణగౌడ్, ఆశాకార్యకర్త రత్నమాల తదితరులు పాల్గొన్నారు.

కుంటాల: ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని ఎంపీడీవో ఎంఏ రహీం పేర్కొన్నారు. శుక్రవారం డ్రైడేలో భాగంగా మండలంలోని ఆయా గ్రామాల ప్రజలకు వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. నిల్వనీటిని పారబోయించి మాత్రలు పంపిణీ చేశారు. కార్యదర్శి రాజబాపు, ఏఎన్‌ఎం సుచరిత, ఆశాకార్యకర్తలు దేవకి, మమత, విజయ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మించాలని రాస్తారోకో

భైంసాటౌన్: మండలంలోని ఖత్‌గాం నుంచి కామోల్ వరకు రోడ్డు అధ్వానంగా ఉండటంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని.. రోడ్డు నిర్మించాలని పలువురు గ్రామస్తులు ధర్నా చేపట్టారు. శుక్రవారం భైంసా-నిర్మల్ జాతీయ రహదారిపై బైఠాయించి నిరసన చేపట్టారు. రోడ్డు నిర్మించాలని అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని వాపోయారు. ఈ విషయం తెలుసుకున్న రూరల్ సీఐ నైలు నాయక్ వెళ్లి వారిని సముదాయించడంతో ఆందోళన విరమించారు. అనంతరం ఆర్డీవో కార్యాలయానికి వెళ్లి వినతిపత్రం అందజేశారు.

పేదల అభ్యున్నతికి పాటుపడే వ్యక్తి 'ఏలేటి'

నిర్మల్‌చైన్‌గేట్: పేద ప్రజల అభ్యున్నతికి పాటుపడే వ్యక్తి బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అని ఆ పార్టీ రాష్ట్ర నాయకులు రావుల రాంనాథ్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని మహేశ్వర్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మహేశ్వర్‌రెడ్డి నియోజకవర్గంలోని ప్రజలకు అండగా ఉంటూ పాలన సాగిస్తున్నారన్నారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ఒకే విడతలో 633 మంది లబ్ధిదారులకు 1.50 కోట్ల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారని పేర్కొన్నారు. బీజేపీ నాయకులు వడ్డే రాజేందర్ రెడ్డి, బాపురెడ్డి, రాంరెడ్డి, రాజారెడ్డి పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ర్యాలీ



ముధోల్‌లో నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న నేతలు



కుభీర్‌లో..

ముధోల్: ఇటీవల ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు రాజ్యాంగబద్ధంగా లేదని.. దానిని రద్దు చేయాలని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నియోజకవర్గ ప్రతినిధులు పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా వారు అంబేడ్కర్ చౌరస్తా వద్ద అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందించి నిరసన ర్యాలీ తీశారు. కార్యక్రమంలో ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక నియోజకవర్గ కమిటీ ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, మగ్గిడి దిగంబర్, హాసేకర్ ప్రకాశ్, జనరల్ సెక్రెటరీ పవర్ భీంరావు, కాలేవార్ దిగంబర్, సలహాదారులు ప్రకాశ్‌గడపాలే, సోషల్ మీడియా కన్వీనర్ కాలే రావర్, సందీప్ తదితరులున్నారు.

కుభీర్: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా శుక్రవారం మండల కేంద్రంలో ఎస్సీ మాల సామాజిక వర్గం నాయకులు ర్యాలీ నిర్వహించారు. వర్గీకరణకు అనుకూలంగా ఇచ్చిన సుప్రీంకోర్టు తీర్పును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు రాహుల్, ధర్మకిరణ్, సందీప్, గజ్జారాం తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట కమిటీ ఎన్నిక

లోకేశ్వరం: మండల కేంద్రంలోని అంబేద్కర్ సంఘ భవనంలో ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట కమిటీని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆ కమిటీ మండల కన్వీనర్‌గా ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాస్, కోశాధికారిగా శ్రీరాములు, ఉపాధ్యక్షుడిగా దండే రమేశ్, నరేశ్, గంగన్న, మోడం శంకర్, ముత్యం, సలహాదారులుగా రణదీర్, దిలీప్, లక్ష్మణ్, గంగన్న, బాబన్న, రాములు ఎన్నికయ్యారు.

అటెన్షన్ ప్లీజ్.. బోరుకు మరమ్మతులు చేపట్టరూ!



నర్సాపూర్(జి): మండల కేంద్రంలోని ఆరోవార్డులో బోరు పని చేయకపోవడంతో తాగునీటితోపాటు ఇతర అవసరాలు తీర్చుకునేందుకు కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు బోరుకు మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తేవాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రశ్నించాల్సిన అధికారి: తిరుపతిరెడ్డి, ప్రత్యేకాధికారి, ఫోన్ : 99481 11574

సంక్షిప్త వార్తలు

హోమియో మందుల పంపిణీ

బాసర: మండలంలోని బిద్రేల్లి గ్రామంలో శుక్రవారం హోమియోపతి వైద్యశిబిరం ఏర్పాటు చేసినట్లు మండల వైద్యాధికారి తిరుమల తెలిపారు. మధుమేహం, బీపీ, కీళ్ల నొప్పులు, దగ్గు, దమ్ము తదితర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న 100 మందికి పైగా వృద్ధులకు హోమియో మందులు అందజేసినట్లు పేర్కొన్నారు. వారి వెంట జిల్లా ప్రోగ్రాం అధికారి శ్రవణ్, వైద్య సహాయకులు గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

కన్వీనర్‌కు సన్మానం

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 374వ జయంతి వారోత్సవాల నిర్వహణ కమిటీ రాష్ట్ర కన్వీనర్‌గా నియమితులైన అమరవేణి నర్సాగౌడ్‌ను శుక్రవారం బీసీ, ఎస్సీ సంఘాల నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అనుముల భాస్కర్, ముడుసు సత్యనారాయణ, ఇల్లందుల రాజు, వల్లకొండ నర్సాగౌడ్, అశ్విన్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సైకి సన్మానం

ఖానాపూర్: ఉత్తమ సేవలకు గాను అవార్డు అందుకున్న ఎస్సై లింబాద్రిని శుక్రవారం ఖానాపూర్ ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో సన్మానించారు. ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు పడాల లక్ష్మీనారాయణ, వేణుగోపాల్, జర్నలిస్టులు దేవేందర్, రాజశేఖర్, నాగరాజు, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా కమిటీ సమావేశం

సారంగాపూర్: మండలంలోని బీరవెల్లి గ్రామ రైతు పరపతి సహకార పొదుపు సంఘ భవనంలో శుక్రవారం ఆ సంఘం అధ్యక్షుడు లక్కిడి గంగారెడ్డి అధ్యక్షతన జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా అధ్యక్షుడు ఓస రవీందర్ మాట్లాడుతూ జిల్లా రైతులను సంఘటితం చేసి వారి సమస్యలను పరిష్కరించేలా కృషి చేయాలని సంఘం నిర్ణయించినట్లు తెలిపారు. ఇందులో భాగంగా అన్ని మండలాల్లో ఈనెల వచ్చే 10లోగా కమిటీలను ఏర్పాటు చేసి జిల్లా అధ్యక్ష ఎన్నికలను జరుపుతామన్నారు. వచ్చే నెల 19న జిల్లా కిసాన్ సంఘ్ ఆధ్వర్యంలో రైతుమహాసభ నిర్వహించాలని తీర్మానించారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా కార్యదర్శి రాజేశ్వర్, జిల్లా కోశాధికారి రామ్‌గోపాల్, సీనియర్ కార్యకర్తలు నారాయణరెడ్డి, ముత్తన్న, లక్కిడి నాయి, కాంతన్‌రెడ్డి, ప్రవీణ్, కరుణసాగర్ రెడ్డి, నర్సారెడ్డి, తదితరులు ఉన్నారు.